## నేటి నుంచి దర్గా ఉత్సవాలు

కాజీపేట, ఆగస్టు 31: మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే హజరత్ సయ్యద్‌షా అఫ్జల్ బియాబానీ 188వ దర్గా ఉత్సవాలు ఆదివారం ప్రారంభమై మూడు రోజుల పాటు జరుగుతాయని దర్గా పీఠాధిపతి ఖుస్రుపాషా తెలిపారు. దర్గా కాజీపేటలోని ఖుస్రుపాషా నివాసంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. ఆదివారం రాత్రి 11 గంటలకు సంధల్ (గంధ లేపనం), సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పీఠాధిపతులు ప్రత్యేక ప్రార్థనలు, మతపెద్దలు సమాధికి చాదర్-ఎ-గుల్ (పుష్ప దుప్పటి) కప్పి ప్రార్థనలు చేస్తారు. మంగళవారం ప్రార్థనలు ఉంటాయని తెలిపారు.

## 'రాష్ట్ర ప్రభుత్వంపై రాజీలేని పోరాటం'

రాయపర్తి, ఆగస్టు 31: సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు బూటకపు హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్‌పై రాజీలేని పోరాటం చేసేందుకు బీజేపీ నేతలు సిద్ధం కావాలని పార్టీ రాష్ట్ర నాయకుడు కర్ర శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలకేంద్రంలో మండలాధ్యక్షుడు నూనె అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి సర్కార్‌కు రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు.

# ఛీ..ఛీ ఇదేం గురుకులం

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి
- నిర్వహణపై తీవ్రస్థాయిలో ఆగ్రహం
- అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆధిపత్యంపై ఆరా
- 'నమస్తే తెలంగాణ' ఎఫెక్ట్

రాయపర్తి, ఆగస్టు 31: 'ఛీ..ఛీ ఇదేం సంక్షేమ గురుకులమండీ...? వర్షాకాలం సీజన్‌లో గురుకులాన్ని ఇలాగేనా ఉంచేది... మీ పిల్లలు చదువుకునే గురుకులాలు అయితే ఇంత అధ్వానస్థితిలో ఉంటే మీరు చూస్తూ ఊరుకుంటారా' అని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. మండలకేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ సరిత, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది గురుకులంలా కాదు.. పశువుల పాకల కన్నా అధ్వానంగా మార్చివేశారని మండిపడ్డారు. మండలకేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాల, కళాశాలల్లో జరుగుతున్న తతంగంపై 'గురుకులంలో గందరగోళం' శీర్షికన నమస్తే తెలంగాణలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎమ్మెల్యే శనివారం గురుకులాన్ని సందర్శించారు. ప్రిన్సిపాల్ సరితతో సమావేశమై పరిస్థితులపై చర్చించారు. అనంతరం గురుకులంలోని స్టాఫ్ రూంకు వెళ్లిన ఆమె అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని వెంకటపద్మ వద్ద ఉన్న రికార్డులు, రిజిస్టర్లు, ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. హాజరు పట్టికల్లో పలువురు ఉద్యోగుల సంతకాలు లేకపోవడంతో అసలు ఈ గురుకులంలో ఏం జరుగుతోందనని ప్రశ్నించారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థినులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మూత్రశాలలు, మరుగుదొడ్లను పరిశీలించి నిర్వహణను గాలికొదిలేశారా అన్ని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కిచెన్‌లో ఉన్న కూరగాయలు, భోజనాల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినులకు రాత్రి పూట పెట్టాల్సిన భోజనాన్ని మధ్యాహ్నమే ఎందుకు తయారు చేయించారని ప్రశ్నల వర్షం కురిపించారు. గురుకులంలో గందరగోళ పరిస్థితులు, సర్వీస్ రికార్డుల మాయం, అవుట్ సోర్సింగ్ ఉద్యోగినుల ఆధిపత్య ధోరణిపై సమగ్ర విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలకు సిఫారసు చేస్తానన్నారు.



ప్రిన్సిపాల్ సరితతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

















